
సాక్షి బాపట్ల

సోమవారం ♦ 6 ♦ మే ♦ 2024



ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు గ్రామంలోని మహంకాళేశ్వరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోగల శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్‌కు 7, 8 తేదీల్లో అవకాశం

జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

బాపట్ల: ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి ఓటుహక్కు వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పోస్టల్ బ్యాలెట్‌కు మరో అవకాశం కల్పించారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల, ఇతర జిల్లాలలో ఎన్నికల విధులకు ఎంపికై వివిధ కారణాలతో ఫారం-12 (పోస్టల్ బ్యాలెట్) దరఖాస్తు చేసుకోని ఉద్యోగులకు రాష్ట్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. మే 7, 8 తేదీల్లో ఓటుహక్కు కలిగిన నియోజకవర్గాల్లో ఆయా రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫారం-12 సమర్పించి పోస్టల్ బ్యాలెట్‌ను పొందవచ్చని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఉద్యోగులకు ఆ రోజు ప్రత్యేక సాధారణ సెలవును ఉపయోగించుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.

ఓటమి భయంతోనే దాడులు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట రూరల్: ఓటమి భయంతోనే టీడీపీ దాడులకు పాల్పడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. మండలంలోని రావిపాడు వెంగళరెడ్డి కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై శనివారం రాత్రి టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. కాలనీలో ప్రచారం ముగిసిన అనంతరం టీడీపీ కార్యకర్తలు తన ఇంటి ముందున్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులపై ఒక్కసారిగా కర్రలతో దాడులకు దిగారు. దాడిలో బొడ్డు శ్రీనివాసరావు, చందు, శాలమ్మ గాయపడ్డారు. వీరిని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గాయపడిన వారిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నరసరావుపేటలో గెలవడం కష్టమని తెలిసి టీడీపీ హింసకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించే కుట్ర జరుగుతుందన్నారు. ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసుల్ని కోరారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, నాయకులు మూరే రవీంద్రారెడ్డి, జాన్ ఉన్నారు.

పింఛన్ తీసుకోవడానికి వెళ్లి వృద్ధురాలు మృతి

బెల్లంకొండ: పింఛన్ తీసుకోవడానికి వెళ్లి 75 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని పాపాయపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓర్చు వెంకటరమణ (75)కు దాచేపల్లి స్టేట్ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఆమె పింఛన్ తీసుకోవడానికి శనివారం ఎండలో బ్యాంకుకు వెళ్లింది. డబ్బులు తీసుకుని బయటకు వచ్చి కళ్లు తిరిగి పడిపోయింది. స్థానికులు చనిపోయినట్లు గుర్తించారు. ఆమె వద్ద ఉన్న బ్యాంకు అకౌంట్ పుస్తకం, పెన్షన్ బుక్‌లో వివరాలు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామం పాపయపాలెం తీసుకు వెళ్లారు. గతంలో మాదిరిగా వలంటీర్ల ద్వారా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చి ఉంటే మృతి చెంది ఉండేది కాదని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

పిడుగుపాటుకు గేదెలు మృతి

రెంటచింతల: రెంటచింతల గ్రామ సమీపంలోని జ్యోతి స్వరూప కోల్డ్ స్టోరేజ్ వద్ద పంటపొలాలలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై రెండు పాడిగేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బోయిన మైసయ్య గేదెలను మేత కోసం పొలానికి తోలుకెళ్లాడు. సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చి పిడుగు పడడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. 1.40 లక్షలు ఉంటుందని మైసయ్య వాపోయాడు.

59 మేకలు మృతి

దుర్గి: మండలంలోని కాకిరాల గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు గురై 59 మేకలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బూదిరి లక్ష్మయ్య, కొంగా గోవిందు, కొంగా పెదగంగయ్యలు మేకలను మేపుకునేందుకు పొలానికి వెళ్లారు. వర్షపు జల్లులు పడుతుండగా మేకలను చెట్టు కిందకు తోలుకెళ్లారు. ఆ సమయంలో పిడుగు పడటంతో బూదిరికి లక్ష్మయ్యకు చెందిన 40 మేకలు, కొంగా పెద గంగయ్యకు చెందిన 15, కొంగా గోవిందుకు చెందిన నాలుగు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని వారు వాపోయారు. పిడుగుపాటుకు కొంగా లక్ష్మీనారాయణ, బూదిరి లక్ష్మయ్యలు స్పృహ తప్పి పడిపోయారు.



అమర్తలూరు మండలంలోని యలవర్రు, పంచాళవరం, గోవాడ గ్రామాల్లో , వేమూరు మండలంలోని పెరవలి, పెరవలిపాలెం గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల్ని చంద్రబాబు నాయుడు మోసం చేస్తాడని, వంగవీటి రంగాను దారుణంగా హత్య చేయించిన తెలుగు దేశం పార్టీకి ఓట్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. – వేమూరు



వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో నిజం.. సూపర్‌సిక్స్ మేనిఫెస్టో పచ్చి అబద్ధమని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణ వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 20వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి కిచిడీ పార్టీల మేనిఫెస్టో కాపీ కొట్టి అలివికాని హామీలు ప్రకటించిందని విమర్శించారు. –చీరాల టౌన్

ప్రచార పర్వం



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చట్టసభల్లో కూర్చోబెట్టిన ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అని పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం పర్చూరు అంబేడ్కర్ నగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేశారు. – పర్చూరు

నేడు సీఎం వైఎస్ జగన్ రేపల్లె రాక

ఉదయం అంబేడ్కర్ సెంటరులో ఎన్నికల ప్రచార సభ

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా రేపల్లె పట్టణానికి సోమవారం ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు.వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహం సెంటరులో జరగనున్న ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో పెనుమూడి నేషనల్ హైవే పక్కన ఏర్పాటు చేస్తున్న హెలి ప్యాడ్ స్థలాన్ని ఆదివారం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, పార్టీ అభ్యర్థి ఈవూరు గణేష్‌తో కలిసి పరిశీలించారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో రేపల్లె పట్టణానికి తొలిసారి వస్తున్న నేపథ్యంలో సభను విజయం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి , పార్టీ నేతలు ఉన్నారు.

భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

సభ ప్రాంగణంలో భద్రత ఏర్పాట్లను బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. ఆయన వెంట రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.



హెలి ప్యాడ్ స్థల పరిశీలన చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

భారీగా తరలిరానున్న పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం రేపల్లెకు రానున్నారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో జరిగే ఎన్నికల ప్రచారసభలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మాచర్ల నియోజకవర్గంలో జరిగే సభలో సీఎం ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచార సభకు రానుండడంతో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

రైతు సంక్షేమం వైఎస్సార్ ఫ్యామిలీ పేటెంట్

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి
- హత్యా, శవ రాజకీయాలు టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య
- అవగాహనరాహిత్యంతో మాట్లాడి నవ్వులపాలవ్వడం పవన్‌కు అలవాటు

రేపల్లె రూరల్: రైతు సంక్షేమం వైఎస్సార్ కుటుంబం పేటెంట్ అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రైతు సంక్షేమమంటే గుర్తొచ్చేది వైఎస్సార్ కుటుంబమేనని చెప్పారు. రైతుపక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాల్ని విజయవంతంగా అమలు చేశారని తెలిపారు. రేపల్లె ప్రాంతంలో జూదాలు, కబ్జాలు, మట్టి మాఫియా, ఇసుక మాఫియాలతో పెట్రేగింది టీడీపీ నాయకులేనని, ఆ విష సంస్కృతి వారి సొంతమని ఆరోపించారు. రేపల్లె ప్రచార సభలో పవన్ కల్యాణ్ అవగాహనరాహిత్యంతో మాట్లాడి నవ్వుల పాలయ్యారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు బాగుకోసమన్నట్లు ప్యాకేజీలు తీసుకుంటూ ప్రసంగాలిస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. నిజాంపట్నంలో రూ.451కోట్లతో హార్బర్ అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని చెప్పారు. ఇవేమీ పవన్ కల్యాణ్‌కు ఎవరూ చెప్పలేదా ? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఉండే కబ్జా సంస్కృతిని రేపల్లె ప్రాంతానికి తీసుకువచ్చి తమపై విమర్శలు చేయటం తగదని ఖండించారు.



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి, పక్కన అభ్యర్థి ఈవూరి గణేష్

అమర్‌నాథ్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకున్నాం

అమర్‌నాథ్ గౌడ్ కటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారంతో పాటు 3 సెంట్ల నివేశన స్థలాన్ని అందించి ఇంటి నిర్మాణానికి అనుమతి ఇప్పించామని తెలిపారు. తల్లికి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు మంజూరు చేయించినట్లు వివరించారు. పట్టణంలోని 14వవార్డు టీడీపీ కౌన్సిలర్ అన్నె రామకృష్ణను టీడీపీ నాయకులే అతికిరాతకంగా హత్య చేస్తే సత్యప్రసాద్ ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఒక ప్రాంతానికి వచ్చినప్పుడు రాజకీయ నాయకుడిగా పూర్తి పరిజ్ఞానంతో మాట్లాడాలని, లేనిపక్షంలో పవన్ కల్యాణ్ నవ్వుల పాలుకాక తప్పదని సూచించారు. సమావేశంలో పార్టీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్, ఎన్నికల పరిశీలకుడు అడపా శేషు, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులు
- బాపట్ల నియోజకవర్గంలో 91.6 శాతం నమోదు

బాపట్ల: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్. శ్రీధర్ పర్యవేక్షణలో స్థానిక మున్సిపల్ హైస్కూలు వద్ద ఓటింగ్ నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 837 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 767మంది ఉద్యోగస్తులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 91.6 పోలింగ్ శాతం నమోదైంది. ఉద్యోగస్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రత్యేక మెడికల్ క్యాంపును కూడా నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ ఎన్నికల తీరును పరిశీలించారు.

మొదటి రోజు 895 మంది వినియోగం

చీరాల: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించారు. మొదటి రోజు 965 మందికి గానూ 895 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సరళిని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్, పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్ పరిశీలించారు.

ఉద్యోగులను ఆదుకున్నది వైఎస్సార్ సీపీనే...

అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి అండగా ఉండటంతో పాటు పెండింగ్ బిల్లులు కూడా చెల్లించారని తెలిపారు.



బాపట్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగస్తులు



చీరాల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు

వైఎస్సార్ సీపీకి, సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచి ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వస్తే ఉద్యోగులకు పింఛన్, జీతాలు చెల్లించకుండా మోసం చేస్తారని విమర్శించారు. విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ చెల్లించాలంటే ఆర్థికలోటు ఏర్పడుతుందని, మోసపూరితమైన చంద్రబాబు మాటలు నమ్మవద్దని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్‌ను కొనుగోలు చేస్తున్న టీడీపీ

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని టీడీపీ పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తోంది. పోలింగ్ కేంద్రం వద్దే ఒక్కో పోస్టల్ బ్యాలెట్‌కు రూ.2 నుంచి రూ.3 వేలకు నేతలు కొనుగోలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. భారీ ఎత్తున పోలీసులు, ఎన్నికల అధికారులు ఉన్న సమయంలో బహిరంగంగానే టీడీపీ నేతలు ఓట్లు కొనుగోలు చేయడం చర్చనీయాంశమైంది.

అభివృద్ధి చేస్తా .. ఒక్క అవకాశమివ్వండి !

జే.పంగులూరు/మేదరమెట్ల: 'నాకు ఒక్క అవకాశమివ్వండి.. ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా'నని వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్నమల్లవరం, కల్లవారిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత మెనిఫెస్టో, వాగ్దానాలతో అధికారంలోకి రావాలని చంద్రబాబు కుట్రలు పన్నుతున్నాడని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా నందిగం సురేష్‌ని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికం కోటిరెడ్డి, జంపాని రవిబాబు, భీమనాథం అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, అద్దంకి ఏఎంసీ డైరెక్టర్ నాగయ్య, చిన మల్లవరం సర్పంచ్ చిలుకూరి వీరయ్య, అశోక్, రామయ్య, గారే కృపారావు, మల్లవరం జక్రయ్య, నూతలపాటి కోటయ్య, కల్లంవారిపాలెం సర్పంచ్ గుడిపాటి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ భవనం భద్రారెడ్డి, సోము ఆదిరెడ్డి, భవనం శ్రీనివాసరెడ్డి, బి. విష్ణువర్ధనంరెడ్డి, జి.అశోక్‌రెడ్డి, జి. మహేష్‌రెడ్డి, ఏ. శ్రీనివాసరెడ్డి, బి. వేణుగోపాల్‌రెడ్డి, జి. నాగార్జునరెడ్డి, బి. శివనాగిరెడ్డి, భవనం బ్రహ్మారెడ్డి, జి. విజయ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



చిన మల్లవరంలో హనిమిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆర్య వైశ్యులకు వైఎస్సార్ సీపీ అండ

- ఆర్య వైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు
- పాల్గొన్న ఎమ్మెల్యే కరణం, ఎమ్మెల్సీ తూమాటి
- పర్చూరు అభ్యర్థి యడం బాలాజీని గెలిపించాలని పిలుపు

మార్టూరు: ఆర్య వైశ్యులకు అన్ని విధాలుగా బాసటగా నిలిచిన సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా పర్చూరు నియోజకవర్గ అభ్యర్థి యడం బాలాజీ విజయం కోసం కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక విజయలక్ష్మి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన పర్చూరు నియోజకవర్గ ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రావి రామనాథంబాబు, ఆర్యవైశ్య ప్రముఖుడు దేవకి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం చేసిన మేలును గుర్తుంచుకోవాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ఈ ఐదేళ్లలో శ్రీశైలం దేవస్థానానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఆరు అన్నదాన సత్రాలు కూడా ఆర్య వైశ్యులకు తప్పా ఇతరులకు చేయలేదనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆర్య వైశ్యుల అభ్యర్థన మేరకు చింతామణి నాటకాన్ని నిషేధించినట్లు తెలిపారు. నవంబరు 1వ తేదీని పొట్టి శ్రీరాములు దినోత్సవంగా అధికారికంగా నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించింది ప్రస్తుత ప్రభుత్వమే అని శిద్దా పేర్కొన్నారు. పెనుగొండలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అభివృద్ధి కోసం రూ. 50 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. వారసులు లేని ఆర్యవైశ్యులకు చెందిన వేలాది కోట్ల రూపాయల నిధుల నిర్వహణ వారే నిర్వహించుకోవచ్చని జీవో జారీ చేసిన క్రెడిట్ జగనన్నకే దక్కుతుందని వివరించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మూడు టికెట్లు ఇచ్చిందని, నామినేటెడ్ తదితర పదవుల్లో సైతం ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం కల్పించిందని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, యడం బాలాజీ, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌లను గెలిపించుకోవాల్సిన బాధ్యత ఆర్యవైశ్యులకే ఉందని ఆయన పిలుపునిచ్చారు.

అన్ని రంగాల్లో ముందంజలో ఆర్యవైశ్యులు

ఎమ్మెల్యే కరణం బలరాం మాట్లాడుతూ నిజాయతీగా వ్యాపారాలు చేసుకుంటూ ప్రశాంత జీవనం సాగించే ఆర్యవైశ్యులు నేడు అన్ని రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకోవడం ఆహ్వానించదగిన పరిణామం అన్నారు. ఆర్య వైశ్యులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ తూమాటి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా చీరాలలో ఆర్యవైశ్యులకు అండగా ఉంటున్న యడం బాలాజీని గెలిపించాలని పిలుపునిచ్చారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రావి రామనాథంబాబు మాట్లాడుతూ పర్చూరు ఎమ్మెల్యేగా సోదరుడు బాలాజీని గెలిపిస్తే ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తారని, వ్యాపార అభివృద్ధికి తోడ్పడతారని తెలిపారు. యడం బాలాజీ మాట్లాడుతూ ఇతరులకు ఇవ్వడమే తప్పా లాక్కునే మనస్తత్వం లేని ఆర్యవైశ్యుల కోరుకునేది ప్రశాంత జీవనం, గౌరవమేనని, వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌లకు రెండు ఓట్లు సీలింగ్ ఫ్యానుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆర్య వైశ్య ప్రముఖులు దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలాజీ గెలుపు కోసం నియోజకవర్గ ఆర్య వైశ్యులంతా సమైక్యంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బాలాజీని ఆర్యవైశ్యులు జీడిపప్పు మాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ముఖ్య అతిథులు శిద్దా, కరణం, తూమాటి, రామనాథం బాబులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ నిర్వాహకుడు పొత్తూరు శివ, నియోజకవర్గంలోని ఆర్యవైశ్య ప్రముఖులు నూనె వెంకటేశ్వర్లు, కలిపార పూర్ణయ్య, మువ్వల రాంబాబు, సాతులూరి మోహనరావు, ఆత్మకూరి సీతారామాంజనేయులు, పోలిశెట్టి శ్రీనివాసరావు, ఎన్. సతీష్, వలివేటి శ్రీనివాసరావు, పోలిశెట్టి వెంకటేశ్వర్లు తవ్వా రవి, చిమ్మి పూర్ణ పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, పక్కన అభ్యర్థి యడం బాలాజీ

చీరాల అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్. వేదికపై ఎంపీ అభ్యర్థి సురేష్, నేతలు

ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్

చీరాల అర్బన్: ఆర్యవైశ్యులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉంటుందని ఆ పార్టీ బాపట్ల ఎంపీ నందిగం సురేష్, చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక ఎన్వీఎస్అండ్ఎస్‌జీఆర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం గుంటూరు మాధవరావు అధ్యక్షతన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ అభ్యర్థి సురేష్, అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నందిగం సురేష్ మాట్లాడుతూ చీరాల పట్టణానికి చినబొంబాయిగా బ్రాండ్ రావడంలో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో ఉందని తెలిపారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ మాట్లాడుతూ ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో ఆర్యవైశ్యులు అండగా ఉండి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చీమటా సాంబు, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, డాక్టర్ సెల్ అధ్యక్షులు గుంటుపల్లి సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు, శిఖాకొల్లి వెంకటేశ్వర్లు, ప్రత్తి వెంకటసుబ్బారావు, తిరువీధుల రవి, చేబ్రోలు బాబాజీ, కొత్తమాసు పూర్ణచంద్రరావు, బాంబే సురేష్, అక్షంతల శ్రీనివాసరావు, ఆర్.వి. స్వామి, వలివేటి మురళీకృష్ణ, కె.వి. సుబ్బారావు, వేముల నాగేశ్వరరావు, వేముల చంద్రశేఖర్, జి.ఎల్. నారాయణ, వి.రాజా, జి.విశ్వం పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

ఏపీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ కొత్తా చిన్నపురెడ్డి



రెంటచింతల: ప్రజలకు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని ఏపీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ కొత్తా చిన్నపురెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, ఎంపీగా పి. అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఐదేళ్ల పరిపాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆదూరి ఇన్నారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు పేర్ల ముత్తయ్య, ఏరువ విజయరెడ్డి, గుజ్జుల సైదారెడ్డి, గంజి బాలరెడ్డి, కొమ్మారెడ్డి మర్రెడ్డి, ఏరువ ప్రతాప్‌రెడ్డి, పేర్ల లక్ష్మయ్య, బంకూరి తిరుపతిరావు పాల్గొన్నారు.

గిరిజనులకు మేలు జరగాలంటే జగనే రావాలి

వైఎస్సార్‌సీపీ ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతునాయక్

దుర్గి: పేద, బడుగు, బలహీన వర్గాల గిరిజనులకు మేలు జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే రావాలని వైఎస్సార్‌సీపీ ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతునాయక్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మంగాపురంతండా, చంద్రకుంట తండ, లక్ష్మీపురం తండాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా తండాలలోని గిరిజన కుటుంబాలను కలిసి వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధిని వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి వర్గంలో గిరిజనులకు సముచిత స్థానాన్ని కల్పించిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి, విజిలెన్స్ మానటరింగ్ కమిటీ మెంబర్ సభావత్ రవి నాయక్, సర్పంచ్‌లు రమావత్ మాద్యానాయక్, కేతావత్ శ్రీనునాయక్, ఆర్‌ఓఎఫ్ఆర్ డిస్ట్రిక్ కమిటీ మెంబర్ రంగానాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతావత్ శ్రీను నాయక్, బోజ్యానాయక్, మోతీలాల్ నాయక్, మునీ నాయక్, అంజినీ కుమార్ నాయక్, సంతోష్ నాయక్, రామూ నాయక్ పలువురు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతి సీఎం జగన్ లక్ష్యం

పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ

పర్చూరు (చినగంజాం): అన్ని సామాజిక వర్గాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభ్యున్నతిలోకి తెచ్చారని పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం పర్చూరు అంబేడ్కర్ నగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను అత్యధికంగా చట్ట సభల్లో కూర్చోబెట్టిన ఏకైక సీఎం జగనన్నే అని చెప్పారు. బీసీలను బ్యాక్ బోన్‌గా నిలబెట్టారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి, గెలిపించాలని ఆయన కోరారు. స్థానిక లూథరన్ చర్చిలో బాలాజీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, చంద్రగిరి ఏసురత్నంతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అప్పారావు, హరిప్రసాద్, ప్రసాద్, శ్రీనివాసరావు, కృష్ణమోహన్, శివనాగేశ్వరరావు, భాస్కరరావు, నాగేశ్వరరావు, షేక్ జిన్నా, శ్రీహరి, హేమంత్, రమేష్, రాము, రవీంద్రనాథ్ ఠాగూర్, రమేష్, సురేష్, నాగమణి, బలరాం, స్వరాజ్ కుమార్, రోశయ్య, నాగేంద్రం, కాలేషా, అహ్మద్ బాష, బాజీ, మహమద్ అలీ, పూర్ణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



పర్చూరు అంబేడ్కర్ నగర్‌లో యడం బాలాజీ ఎన్నికల ప్రచారం

చట్టసభలలో వడ్డెరలకు ప్రాధాన్యం..

చట్ట సభల్లో వడ్డెరలకు (వడియరాజులు) ప్రాధాన్యం కల్పించిన జగనన్నకే వడ్డెరలంతా ఓటు వేయాలని యడం బాలాజీ పిలుపునిచ్చారు. ఇంకొల్లులోని లక్ష్మీ ప్రియాంక కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నియోజకవర్గంలోని వడియరాజుల ఆత్మీయ సమావేశం శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ తన్నీరు ధర్మారావు అధ్యక్షతన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వడ్డెరలకు సంఘం చైర్మన్, ట్రస్ట్ బోర్డు చైర్మన్, ఎమ్మెల్సీ, శాసన సభలో ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సుమారు 75 మంది వడ్డెరలకు నామినేటెడ్ పదవులిచ్చారని గుర్తుచేశారు. వడ్డెరలంతా ఐకమత్యంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్సీ తూమాటి కోరారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ వడ్డెరలకు మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, గుంటూరు మిర్చియార్డు చైర్మన్ ఇచ్చిన జగనన్నను గుండెల్లో పెట్టుకుంటామన్నారు. ఆయనను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుంటామని హామీ ఇచ్చారు. మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, వడ్డెర నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికే మేలు

వేమూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

గోవాడ(వేమూరు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని ఆ పార్టీ వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం అమర్తలూరు మండలంలోని యలవర్రు, పంచాళవరం, గోవాడ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవుడు ప్రజలకు మేలు చేస్తే దశ భాగం చెల్లించడం జరుగుతుందన్నారు. వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేశారని, అందు వల్ల ప్రతి ఒక్కరూ ఓటును దశ భాగం వేయాలన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యత చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అందు వల్ల ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సురేష్, ఎంపీపీలు నరేంద్ర, నాగేశ్వరరావు, ఎంపీటీసీ ఝన్సీ, నాయుడుమ్మ, షార్టీన్, జయంతరావు, మాజీ సర్పంచ్ రత్నబాబు, నాయకులు రత్నకర్, ఎస్కేల్, లాం బోస్, గోపి, కిరణ్, కుమార్, టి.శ్యామ్ ప్రసాద్, నారాయణ, టి.వెంకట్, చేకూరి చౌదరి, శ్రీరామ మూర్తి, రమాదేవి, రవిరాజా, ప్రసాద్, చైతన్య, రమేష్, చెన్నకేశవులు, పోలయ్య, శ్రీను, నాగభూషణం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గోవాడ ఎన్నికల ప్రచారంలో వరికూటి అశోక్‌బాబు

నవరత్నాలు నిజం..సూపర్ సిక్స్ అబద్ధం

చీరాల వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్



కరణం వెంకటేష్‌కు ఆప్యాయంగా రాఖీ కడుతున్న చిన్నారులు

చీరాల టౌన్: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో నిజమని.. సూపర్‌సిక్స్ మేనిఫెస్టో పచ్చి అబద్ధమని చీరాల అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపాలిటీ 20వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి కృషి చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల విషయంలో.. స్థానిక సంస్థల్లో మహిళలకే పెద్దపీట వేశారని చెప్పారు. ప్రతి పథకం మహిళల పేరు మీదే అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అలాంటి నవరత్నాలు కొనసాగింపుగా ప్రస్తుత మేనిఫెస్టోను విడుదల చేశామన్నారు. కానీ, కూటమి కిచిడి పార్టీలు మేనిఫెస్టోను కాపీ కొట్టి.. అలివికాని హామీలు ప్రకటించినట్లు చెప్పారు. అవి సూపర్ సిక్స్ పథకాలు కావు.. పచ్చి మోసం చేసే పథకాలు అని కరణం వెంకటేష్ ఎద్దేవా చేశారు. చీరాలను అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాదేనన్నారు. మరికొన్ని రోజుల్లో జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కల్లగుంట అంజమ్మ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు చీమకుర్తి బాలకృష్ణ, రాష్ట్ర సేవదళ్ సెక్రటరీ గోలి గంగాధర్, సలగల అమృతరావు, షేక్ మస్తాన్, అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు, చిన్ని లీలధర్, పేరకం లక్ష్మీనారాయణ, అర్వపల్లి లీల, మద్దెలా మురళి, పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వానికి పేదలే అండ



భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి అన్నారు. ఆదివారం భట్టిప్రోలు మండలంలోని పెసర్లంక, పెదలంక, చింతమోటు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భర్తను, ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శంకరరావు, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, పీఏసీఎస్ చైర్ పర్సన్ గుమ్మడి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుజ్జర్లమూడి రాజు, దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

పిడుగురాళ్ల: ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడు అండగానే ఉంటుందని వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శుభమస్తు కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాసు మహేష్‌రెడ్డి వాసవీ అమ్మవారి చిత్ర పటానికి పూలమాలలు వేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందించడం వల్ల ప్రతి ఆర్యవైశ్య వ్యాపారాలు బాగున్నాయన్నారు. గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కావాలా, డబ్బులు, అహంకారం, పెత్తందారుల వ్యవస్థల కావాలో మీరు నిర్ణయించుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, నర్సరావుపేట పార్లమెంట్ పరిశీలకులు రేపాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భవనాశి యల్లారావు, వివిధ అసోసియేషన్ అధ్యక్షులు, దేవస్థాన అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల సమరంలో పేదలు జగన్ వైపు నిలవాలి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ ఇశ్రాయేల్ పిలుపు

పర్చూరు (చినగంజాం): పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో పేదలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైపు నిలవాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ ఇశ్రాయేల్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన ఇడుపులపాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ ఐదేళ్లలో దళితులకు అనేక సంక్షేమ పథకాలు అందించి, వారి జీవితాల్లో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. దళితులు బాగుపడటం చంద్రబాబుకి ఇష్టం లేదని విమర్శించారు. కూటమి సభ్యుల కల్లబొల్లి మాటలు నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీని, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో దుడ్డు శేషగిరి, నూతలపాటి బలరాం, పిల్లి సుందరరావు, జొన్నలగడ్డ ఇజ్రాయేల్, మూట్లూరి కృపారావు, కంభంపాటి కోటి తదితరులు పాల్గొన్నారు.



ఇడుపులపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇశ్రాయేల్

బంగారు బాపట్లగా తీర్చిదిద్దుకుందాం

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: బాపట్లను బంగారు బాపట్లగా తీర్చిదిద్దుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పౌర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఎకో హౌసెస్ ఏర్పాటు చేసిన వేదికలో సాధారణ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ వేదికలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ చరిత్ర కలిగిన బాపట్లను.. టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేయటంతో పాటు పర్యాటక కేంద్రంగా మారుస్తానని చెప్పారు. జిల్లా కేంద్ర స్థాయిలో బాపట్లను అభివృద్ధి చేసుకునేందుకు కృషి చేశామని కోన చెప్పారు. మరో ఐదేళ్లలో రూ.75 కోట్లతో బాపట్ల పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి జరుగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మరాజు, అభ్యర్థులు వేద శ్రీనివాసరావు, జి.రాజారావు పాల్గొని, తమ పార్టీ అజెండాను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పౌర సమాఖ్య సభ్యులు డాక్టరు పి.విజయ్‌కుమార్, డాక్టరు పి.సి.సాయిబాబు, డాక్టరు పి.ఆశా మాధవి, జి.రమాదేవి, జీవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు వెళ్తూ..

కారు ఢీకొట్టిన లారీ.. ఆరుగురికి తీవ్రగాయాలు



క్షతగాత్రులు



దెబ్బతిన్న కారు

అద్దంకి: కారును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని శాంతినగర్ సమీపంలో ఆదివారం జరిగింది. అందిన వివరాల మేరకు.. సంతమాగులూరు మండలంలోని వెల్లల చెరువు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (బాబు) పంతులు ఆయన కుమార్తె విష్ణు, అక్క గోపు పద్మ, కేసరి శ్రీనివాస్‌రెడ్డి కారులో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు అద్దంకి వస్తున్నారు. శాంతినగర్ సమీపంలో హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న లారీ కారును ఢీ కొట్టింది. ప్రమాదంలో కారులోని ఆరుగురికి తీవ్ర గాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రులకు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్..

ఇద్దరు నెల్లూరు యువకులు మృతి



మృతుడు చరణ్

అద్దంకి: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. నెల్లూరు జిల్లా కొడవలూరు గ్రామానికి చెందిన కంచి చరణ్ (22) హైద్రాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్స్‌లో చేరి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. కావలికి చెందిన రాజేశ్ (20) బీటెక్ చదువుతూ ఫ్లిప్ కార్ట్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడు. ఎన్నికల సమయం కావడంతో ఇద్దరూ బైకుపై స్వగ్రామాలకు బయలుదేరారు. అద్దంకి పట్టణ సమీపంలోని విద్యుత్ కార్యాలయం వద్దకు రాగానే బైక్ డివైడర్‌ను ఢీ కొట్టడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో చరణ్ అక్కడికక్కడే మృతి చెందగా, రాజేశ్‌ను చికిత్స నిమిత్తం ఒంగోలు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.

టీడీపీ దాడిలో గాయపడ్డ కానిస్టేబుల్



మాచర్ల రూరల్: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ వారికి గ్రామంలో స్వాగతం పలికి భోజనం పెడతామంటూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసి అడ్డుకోబోయిన పోలీసు తల పగలకొట్టిన సంఘటన ఆదివారం మండలంలోని అడుగురాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలోకి వెళితే వైఎస్సార్‌సీపీ పార్టీ అభ్యర్థులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను పిలిపించాలంటూ రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే పీఆర్కే సతీమణి పిన్నెల్లి రమాదేవి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి కార్యకర్తలు, నాయకులకు భోజనం ఏర్పాటు చేశారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు రామిశెట్టి సుబ్బారావు, మరికొందరు ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపైకి వెళ్ళి దాడికి దిగి గొడవ పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న విజయపురి సౌత్ పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువురికి సద్దుబాటు చేసే ప్రయత్నంలో టీడీపీ నాయకులు పోలీసులపై తిరగబడి దాడి చేశారు. ఈ సమయంలో హెడ్ కానిస్టేబుల్ మోడవత్ సాంబశివ నాయక్ తలకు తీవ్రగాయమైంది. ఆయనతో పాటు పలువురికి గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఎన్నో సంవత్సరాల నుంచి గ్రామం ప్రశాంతంగా ఉన్న సమయంలో ఎన్నికల్లో ఓట్ల కోసం టీడీపీ నాయకులు వర్గాలు, గొడవలు సృష్టిస్తున్న టీడీపీ నాయకులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



పార్టీలోకి చేరిన గౌడ సంఘీయుతో ఈవూరి గణేష్

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమం చూసి వైఎస్సార్ సీపీలో చేరికలు జోరుగా సాగుతున్నాయని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. నిజాంపట్నం మండలం కళ్లిఫలం గ్రామంలో టీడీపీకి చెందిన గౌడ సంఘీయులు 30 కుటుంబాల వారు ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీని వీడి గుళ్లపల్లిలోని ఈవూరి గణేష్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి డాక్టర్ గణేష్ పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. బెల్లంకొండ వెంకట నారాయణ, సాంబయ్య, వెంకటస్వామి, శ్రీనివాసరావు, మణికంఠ, నాగలక్ష్మి, నాగరాజు, శ్రీనివాసరావు, కాటూరి మునేశ్వరరావు, రాజమ్మ, మంగమ్మ, వెంకటేశ్వరమ్మ, పరిశా ప్రసాద్, బొలగాని వెంకయ్య, నాగేంద్రం, వెంకట రమణ, తదితరులు పార్టీలో చేరి వారిలో ఉన్నారు.

నన్ను ఓడించడానికి ఊరురా తిరుగుతున్నారు

ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్



ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కాసు

దాచేపల్లి: జంగా కృష్ణమూర్తి బాగుండాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటే ఆయన మాత్రం నన్ను ఓడించడానికి ఊరురా తిరుగుతున్నారని నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి. అనిల్‌కుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు చేశాడు..కానీ పశ్చాత్తాపం పడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు బీసీ బిడ్డగా తాను ఇక్కడ ఎంపీగా పోటీ చేస్తుంటే నా చేయి పట్టుకుని ఈ ప్రాంతంలో నడిపించాల్సిన ఆయన మాత్రం నన్ను ఓడించేందుకు పనిచేయటం బాధగా ఉందని చెప్పారు. మండలంలోని గామాలపాడు గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డితో కలిసి ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా వారికి ఘన స్వాగతం పలికారు. గంగమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎంపీగా పోటీ చేయమని జంగాకి తానే స్వయంగా ఫోన్ చేసి చెప్పానని, అవసరమైతే ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని సీఎం జగనన్న వద్ద కూడా మాట్లాడతానని చెప్పానని గుర్తు చేశారు. ఏ అభ్యర్థి అయితే బీసీకి టిక్కెట్ ఇస్తే గెలవదని చెప్పాడో, అదే అభ్యర్థి గెలుపు కోసం ఆయన పనిచేయడం ఆవేదన కలిగిస్తుందన్నారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత తన నిధుల్లో నుంచి సింహభాగం నిధులు కేటాయిస్తానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీలో సామాజిక న్యాయమే లేదని, బీసీ నాయకుడైన జంగాకి జగనన్న ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవిస్తే టీడీపీలో చేరి ఒక బీసీకి టిక్కెట్ ఇవ్వద్దన్న ఎంపీ కోసం ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు సంకురాత్రి వీరయ్య, ఉపసర్పంచ్ షేక్ పెదహుస్సేన్, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, మాజీ ఉపసర్పంచ్ సైదుమస్తాన్, యార్డు మాజీ డైరెక్టర్ చాప శేషయ్య, నాయకులు జంగా ఏసయ్య, జంగా నారాయణ, యలగాల నరసింహారావు, పోలే సుధీర్, షేక్ జానీ, పోలే కోటేశ్వరరావు, మేదర దానియేలు, కుర్రి అజయ్ పాల్గొన్నారు.

కుటుంబ సమేతంగా..



వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు గెలుపును కాంక్షిస్తూ ఆయన కుమార్తె మణి కుమారి, అల్లుడు గంగాధర్, కోడలు స్వప్న వినుకొండ రూరల్ అందుగుల కొత్తలపాలెంలో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కర పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడుని, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు.

హోం ఓటింగ్ ప్రక్రియ పరిశీలన



పర్చూరు (చినగంజాం): పర్చూరు మండలంలోని పోతుకట్ల, ఉప్పుటూరు గ్రామాల్లో జరిగిన హోం ఓటింగ్ ప్రక్రియను పర్చూరు రిటర్నింగ్ అధికారి జి.రవీందర్ ఆదివారం పరిశీలించారు. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రం వద్దకు నడవలేని దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ ఇంటి దగ్గర నుంచి ఓటు వేసుకునే సౌలభ్యం కల్పించింది. తహసీల్దారు సుబ్బయ్య, పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

మేమంతా వైఎస్సార్ సీపీ వెంటే..



పొన్నూరు: ఇటీవల రాజీనామా చేసిన సచివాలయ వలంటీర్లు ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణను కలిశారు. జగనన్న ప్రభుత్వం తమకు అండగా నిలిచిందన్నారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థపై టీడీపీ, జనసేన పార్టీలు దుర్మార్గంగా వ్యవహరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా వైఎస్సార్ సీపీ గెలుపు కోసం స్వచ్ఛందంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని, మళ్లీ జగనన్న సంక్షేమంలో వలంటీర్లు ప్రజలకు సేవలు అందించడం తథ్యమన్నారు.

వైద్యం అందుబాటులోకి వచ్చింది. అన్ని రకాల సేవలు అందున్నాయి. ఖరుదైన వైద్యం పేదలకు చేరింది. నాడు– నేడుతో వైద్యరంగం ఎన్నడూ లేని మార్పు సంతరించుకుంది. ప్రస్తుతం అధునాతన సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వైద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా గుంటూరు సమగ్ర ఆస్పత్రి వైద్యానికి ప్రసిద్ధి చెందింది.



ఎంసీహెచ్ వార్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే ముస్తఫా, అప్పిరెడ్డి, కావటి, లక్ష్మణరావు

ఆరోగ్యమస్తు

ఇదిగో.. మార్పు

- జీజీహెచ్ వైద్యారంగానికి తలమానికం
- ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ
- కోట్లాది రూపాయల పరికరాలు మంజూరు
- భవన నిర్మాణాల కోసం రూ.కోట్లు ఖర్చు

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్దాస్పత్రిగా గుంటూరు జీజీహెచ్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. గత ప్రభుత్వం హయాంలో టార్చిలైట్ వెలుతురిలో ఆపరేషన్లు.. ఎలుకల దాడిలో పసికందు మృతి లాంటి ఘటనలతో ఆస్పత్రి ప్రతిష్ట మసకబారింది. పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా అందించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు జీజీహెచ్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు.

పోస్టుల భర్తీపై ప్రత్యేక దృష్టి...

యూరాలజీ, న్యూరాలజీలో అదనపు యూనిట్లు మంజూరు చేశారు. నూతనంగా 15 ప్రొఫెసర్లు, 15 అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు మంజూరు చేశారు. జీజీహెచ్‌లో 250 స్టాఫ్ నర్సుల పోస్టులు మంజూరు చేశారు. ఒకేసారి గుంటూరు వైద్య కళాశాలలో 46 పీజీ సీట్లు, ఆరు సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరు చేయించడం ఓ చరిత్రే. 110 పారా మెడికల్ పోస్టులు నూతనంగా మంజూరు చేశారు. గుంటూరు వైద్య కళాశాల ఆధునికీకరణకు రూ.500 కోట్లు, పీజీ సీట్ల వసతుల కల్పనకు రూ.40 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

మంత్రి రజిని చొరవతో ఎంసీహెచ్ వార్డు

టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు రెండుసార్లు శిలాఫలకాలు వేసి ఒక్క ఇటుక కూడా కట్టకుండా పబ్లిసిటీ చేసుకున్న మదర్ అండ్ చైల్డ్ హెల్త్ వార్డు (మాతాశిశు సంరక్షణ కేంద్రం) నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వం, జింకానా సహకారంతో రూ. 80 కోట్లతో నిర్మితమవుతున్న ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఎంసీహెచ్ నిర్మాణం కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం మూడు అంతస్తులు నిర్మాణం పూర్తయింది. కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి రూ.70 లక్షలతో గైనిక్ విభాగాన్ని ఆధునికీకరించారు. అత్యవసర చికిత్సలకు రోగులను తరలించేందుకు రూ.70 లక్షలతో రెండు అంబులెన్సులను మంత్రి రజిని జీజీహెచ్‌కు అందజేశారు. గత ప్రభుత్వంలో నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేసిన సర్వీస్‌బ్లాక్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.7.5 కోట్లు మంజూరు చేసింది. కాకుమానువారితోటలో నూతన ఓపీ భవన నిర్మాణం కోసం మంజూరు చేసిన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి రూ. 3.5 కోట్లు మంజూరు చేశారు. ఆసుపత్రిలో సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతులు కోసం రూ.8.5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.


అదనపు హంగులు...

అదనంగా హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఎమర్జెనీ మెడిసిన్ వంటి వైద్య విభాగాలు ప్రభుత్వం మంజూరు చేసింది.



పరికరాలకు తగిన నిధులు

వైద్య పరికరాలకు రూ. 64 కోట్లు మంజూరు చేశారు. క్యాన్సర్ సెంటర్‌లో రూ.25 కోట్లు ఖరీదు చేసే పెట్‌సిటీ పరికరం కొనుగోలుకు అవకాశం ఇచ్చారు. ఆస్పత్రికి రూ. 4 కోట్లు ఖరీదుచేసే సీటీస్కాన్ పరికరాన్ని మంజూరు చేశారు. రూ.15 కోట్ల ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్, రూ.40 లక్షలు ఖరీదు చేసే సీఆర్మ్, రూ.25 లక్షలు ఖరీదు చేసే కొలనోస్కోపి, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఏబీజీ మిషన్‌లు, రూ.25 లక్షలు ఖరీదు చేసే మైక్రోస్కోప్, రూ.30 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్ లైట్లు, రూ.15 లక్షలు ఖరీదు చేసే మానిటర్స్, రూ.16 లక్షలు ఖరీదు చేసే ఓటీ కార్ట్స్, రూ.20 లక్షలు ఖరీదు చేసే ఎకోమిషన్, ఎన్ఐసీయూ, పీఐసీయూలో కోటి రూపాయల ఖరీదు చేసే వైద్య పరికరాలను మంజూరు చేశారు. కొవిడ్‌లో ఆసుపత్రి మొత్తం ఆక్సిజన్ సరఫరా జరిగేలా కోట్లాది రూపాయలు ఖరీదు చేసే ఆక్సిజన్ ప్లాంట్ల నిర్మాణం, ఆక్సిజన్ పైపుల నిర్మాణం చేయడంతోపాటు, 200లకుపైగా వెంటిలేటర్లను ప్రభుత్వం సరఫరా చేసింది.



రూ. 4 కోట్లు ఖరీదుచేసే సీటీస్కాన్



ఐదేళ్లలో..రూ.6లక్షల లబ్ధి..

గుడిపాడు(క్రోసూరు): సీఎం జగనన్న అందించిన సంక్షేమ ఫలాలతో అత్యధికంగా రూ.6లక్షల లబ్ధి పొందినట్లు గుడిపాడు గ్రామానికి చెందిన షేక్ జానీ బేగం సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం సోషల్ మీడియా బృందం(శంకరన్న కోసం) ఎన్నికల ప్రచారం చేస్తున్న సందర్భంలో గుడిపాడులో షేక్ జానీ బేగం స్పందించారు. అమ్మఒడి, రైతు భరోసా, ఇంట్లో తనకు, తన తల్లికి పింఛను నగదు అందుతోందని, ఇంటి స్థలం, గృహ నిర్మాణం చేసుకున్నట్లు వరుసపెట్టి వివరించారు. ఇంత మంచి చేస్తున్న జగనన్నకే తాము ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు.

‘కొండ’ంత అభిమానం..



చీరాల: సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్ గెలవాలని ఆయన వీరాభిమాని మల్లెల రవీంద్రబాబు ఆదివారం గుణదల కొండను మోకాళ్లపై ఎక్కి తన అభిమానాన్ని చాటుకున్నాడు. చీరాల మున్సిపాలిటీలోని 9వ వార్డుకు చెందిన రవీంద్రబాబు తన అభిమాన నాయకుడు ఎమ్మెల్యే కావాలని గుణదల మేరిమాతకు మొక్కుకున్నాడు. మోకాళ్లపై కొండ ఎక్కి తన అభిమానాన్ని చాటాడు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని మొక్కుకున్నాడు.



సత్తెనపల్లిలో బారులు తీరిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు





గుంటూరు మహిళా కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉపయోగించుకుంటున్న ఉద్యోగులు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



వినుకొండ పట్టణంలోని లయోలా పాఠశాలలో క్యూలో ఉద్యోగులు



బాపట్ల నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో ఉద్యోగులు



బాపట్లలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగి



గణపవరంలో వివరాలు ట్రైనీ కలెక్టర్ కల్పనశ్రీకి వివరిస్తున్న నరసరావుపేట ఆర్వో నారదముని

కార్యకర్తలే..
వైఎస్సార్ సీపీ మహా సైన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని, పక్కన విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి తదితరులు

- పశ్చిమ తలరాతను నిర్ణయించే సమయం వచ్చేసింది
- ఈ వారం.. ప్రతి క్షణం అప్రమత్తం అవసరం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- పశ్చిమలోని కార్పొరేటర్లు, నాయకులతో ప్రత్యేక సమావేశం
- హాజరైన మండలి విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి

పట్నంబజారు: ఎగిసి పడుతున్న సముద్రపు అలలకు సైతం ఎదురొడ్డి పోరాడగల సత్తా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సొంతమని.. పార్టీకి కార్యకర్తలే మహా సైన్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. స్థానిక చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పోరాటాలతో పుట్టిన వైఎస్సార్ సీపీకి పోరు కొత్తేమి కాదని స్పష్టం చేశారు. అచంచల విశ్వాసంతో.. అలుపెరుగని దీక్షతో ముందుకు సాగే ప్రతి కార్యకర్తకు, నేతకు అండగా ఉంటామని హామినిచ్చారు. పశ్చిమ తలరాతను నిర్ణయించే సమయం వచ్చేసిందని, ఈ వారం రోజులే అత్యంత కీలకమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అప్రమత్తం చేశారు. డివిజన్‌లో ఇప్పటికే క్షేత్రస్థాయికి వెళ్లి నాయకులంతా కష్టపడి పనిచేస్తున్నారని, ఇలానే ముందుకు సాగితే ఊహించిన దానికంటే గొప్ప ఫలితాన్ని సాధించవచ్చాన్నారు.

ఐక్యంగా పనిచేద్దాం..

పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగుదామని శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలే రేపటి విజయానికి నాంది పలుకుతాయని స్పష్టం చేశారు. పార్టీ జెండాను భుజాన పెట్టుకుని కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు తలెత్తితే.. తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ఏర్పాట్లు

- ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోండి
- ఇప్పటికే 9.50 లక్షల ఓటర్ స్లిప్పులు అందజేశాం
- ఓటు ఉన్న ప్రతి ఒక్కరికీ స్లిప్పు అందుతుంది
- పోస్టల్ బ్యాలెట్‌పై ఆందోళన వద్దు
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు వెస్ట్: ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్, 7 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని మీడియా సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థుల, ప్రజల సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. జిల్లాలో 17,91,543 మంది ఓటర్లున్నారన్నారు. వీరిలో ఇప్పటికే 9.50 లక్షల మందికి ఓటరు స్లిప్పులను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశామన్నారు. 3.50 లక్షల ఓటర్లకు ఇప్పటికే ఎపిక్ కార్డులు కూడా అందజేశామని తెలిపారు. త్వరలో అందరికీ ఓటరు స్లిప్పులు అందుతాయని చెప్పారు. జిల్లాలోని పార్లమెంట్, 7 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 132 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని చెప్పారు. హోం ఓటింగ్‌కు సంబంధించి 85 ఏళ్లు పైబడిన వారు 12,611 మంది, దివ్యాంగులు 17,357 మొత్తం 29,968 మంది ఉన్నారన్నారు. వీరంతా ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని ఆదర్శంగా నిలిచారన్నారు. వీరి ఓటరు స్లిప్పులు రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉన్నాయన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై ఆందోళన వద్దు...

కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ఈ నెల 5 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్‌లో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. పీఓ, ఏపీఓ, ఓపిఓలు, మైక్రో అబ్జర్వర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చే ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సోమవారం సాయంత్రం వరకు వారు అక్కడే పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవచ్చన్నారు. మన జిల్లాలో పనిచేసేవారు ఇక్కడే పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకుంటారని, ఇక్కడ పనిచేస్తూ ఇతర జిల్లాలో ఓటు ఉన్న వారికి ఆయా జిల్లా కలెక్టర్ల వద్ద నుంచి ఫామ్–12ను తెప్పిస్తున్నామని, అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో పనిచేసే సిబ్బందికి ఇక్కడ ఓటు ఉంటే వారికి కూడా ఫామ్–12ను ఆయా జిల్లాలకు పంపిస్తున్నామన్నారు. దీనివల్ల ఎవరూ ఓటు హక్కును కోల్పోనవసరం ఉండదన్నారు. ఇప్పటివరకు 5860 ఫామ్–12 దరఖాస్తులు ఇతర జిల్లాలకు పంపగా, మనం ఇతర జిల్లాల నుంచి 5092 తీసుకొచ్చామని చెప్పారు. వారంతా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉపయోగించుకుంటారన్నారు.

ఇబ్బందులు పడవద్దు: ఎస్పీ

సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎటువంటి విధ్వంసకర సంఘటనలు జరగలేదన్నారు. తనిఖీ బృందాలతోపాటు పోలీస్ సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో అనవసర ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. కొన్ని గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశముందని వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

అదనంగా ఈవీఎంలు..

జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎక్కువగా ఉండడంతో ఇతర జిల్లాల నుంచి అదనంగా ఈవీఎంలను తెప్పించామని కలెక్టర్ తెలిపారు. పార్లమెంట్‌కు 2239, అసెంబ్లీలకు 1020 తెప్పించామని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచే ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ జరుగుతుందన్నారు. 1309 పోలింగ్ కేంద్రాలకు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. 372 పోలింగ్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వివరించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌పై టీడీపీ నాయకుల దౌర్జన్యం

నాదెండ్ల: గణపవరంలోని శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఓటు వేసేందుకు వచ్చే వారిని టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేశారు. ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున నగదు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా కెమెరాలు ఏర్పాటు చేసింది. ఆ ఇంట్లోకి వచ్చిపోయే వారిని గుర్తించడంతో.. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఆ ఇంటి వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో టీడీపీ నాయకులు స్క్వాడ్‌కు అడ్డు తగిలారు. ఇద్దరు సిబ్బందిని చొక్కా పట్టుకుని లాగి పడేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

పెట్రోల్ బంకు యజమానిపై కేసు నమోదు

- ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన
- రాజకీయ పార్టీ ర్యాలీ బైక్‌లకు కూపన్లతో పెట్రోల్ పట్టిన వైనం
- అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో తనిఖీ



నారాకోడూరులోని బంకులో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

చేబ్రోలు: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పెట్రోలు బంకులో రాజకీయ పార్టీలకు చెందిన ద్విచక్ర వాహనాల ర్యాలీకి కూపన్ల ద్వారా రూ.2 వందల లెక్కన పెట్రోలు పోస్తున్న బంకు యజమానిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, పొన్నూరు నియోజకవర్గ ఎఫ్ఎస్‌టీ బృందాలు సంయుక్తంగా చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలోని సురేంద్ర ఆయిల్ పెట్రోల్ బంకును తనిఖీ చేశారు. ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన ర్యాలీకి వెళ్లే ద్విచక్ర వాహనాలకు కూపన్‌లు తీసుకొని రూ.200లు లెక్కన పెట్రోల్ పోస్తున్నట్లుగా గుర్తించారు. పెట్రోలు బంకులో 374 కూపన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా కూపన్లు తీసుకొని రాజకీయ పార్టీల ర్యాలీకి పెట్రోలు పోయటం చట్ట వ్యతిరేక చర్య అని అధికారులు హెచ్చరించారు. దీనిపై బంకు మేనేజర్‌ను అదుపులోకి తీసుకోవాలని పొన్నూరు నియోజకవర్గ ఎఫ్ఎస్‌టీ బృందం ఇన్‌చార్జి వెంకట్రావును అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారు కిరణ్ కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ మహమూద్ ఆసిఫ్, జీఎస్టీ ఆఫీసర్ వైస్.నాగేశ్వరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.